క్లుప్తంగా

విద్యార్థినులు ఆదర్శంగా నిలవాలి



వ్యాసరచన పోటీల విజేతలతో ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు

తాడిపత్రిటౌన్: విద్యార్థినులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ మునెమ్మ సూచించారు. పట్టణంలోని పుట్లూరు రోడ్డు సమీపంలో ఉన్న కేజీబీవీలో ఉద్యోగ ఉపాధ్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో 'సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు– నివారణ చర్యలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం అమ్మ గొప్పతనం గురించి సంస్థ అధ్యక్షుడు గురప్ప వివరించారు. ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కన్వీనర్ నారబోయిన శంకర్, శ్రీనివాసులు, రామేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కచ్చిత తూకంతో రేషన్ పంపిణీ చేయాలి



రేషన్ దుకాణాల వేయింగ్ మిషన్లను తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల అధికారి శంకర్

యాడికి: చౌక ధాన్యపు దుకాణాల వద్ద పేదలకు కచ్చిత తూకంతో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తూనికల కొలతల అధికారి శంకర్ డీలర్లను హెచ్చరించారు. ఆదివారం చెన్నకేశవస్వామి దేవాలయం ఆవరణలో మండలంలోని 50 రేషన్ డీలర్ల వేయింగ్ మిషన్లను ఆయన తనిఖీ చేశారు. అలాగే మండల కేంద్రంలోని సూపర్ మార్కెట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ సూపర్ మార్కెట్‌లో వేయింగ్ మిషన్‌కు సీలు లేదని, ఆ షాపు యజమానికి రూ.10 వేలు అపరాధ రుసుం విధించారు. కాగా తూనికల కొలతల అధికారి మండలంలో షాపులను తనిఖీ చేస్తున్నారనే సమాచారం అందుకున్న పలువురు వ్యాపారులు తమ షాపులను మూసివేయడం గమనార్హం.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. తల్లిదండ్రులను సన్మానించువారు దీర్ఘాయుష్మంతులవుతారన్నారు. వృద్ధులను గౌరవించడం వల్ల మనకు మంచి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా హరిప్రసాద్



నియామక పత్రం అందజేస్తున్న ఆర్డీఓ

గుంతకల్లు: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజన్ సభ్యుడిగా హరిప్రసాద్ యాదవ్‌ను నియమించారు. ఆదివారం ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న హరిప్రసాద్ రక్తదానం, మూఢనమ్మకాలు తదితర అంశాలపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. సందర్భంగా హరిప్రసాద్‌ను పలువురు అభినందించారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతు



మట్టి వేసి గుంతలు పూడుస్తున్న యువకులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆదివారం కొందరు యువకులు శ్రమదానం చేసి మట్టితో పూడ్చారు. వివరాలు... గుత్తి ఆర్ఎస్ రోడ్డు అధ్వానంగా మారడంతోవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం వచ్చిందంటే వాహనం ముందుకు కదలడం కూడా కష్టమే. ఎమ్మెల్యే సహా అధికారులు ఇదే రోడ్డుపై వెళుతుంటారు. కాని రోడ్డు మరమ్మతులు చేపట్టడం లేదు. యువకులు శివ, అఖిల్, శ్రీధర్, వేము, హేమంత్ తదితరులు స్పందించారు. శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేశారు. గంపల్లో మట్టిని తెచ్చి గుంతలు పూడ్చారు. వాహనదారులు, పాదచారులు యువకులను అభినందించారు.

పచ్చని చెట్లు బొగ్గుపాలు

- విచ్చలవిడిగా బొగ్గుల బట్టీలు
- పట్టించుకోని అధికారులు



యల్లనూరు సమీపంలో ఏర్పాటు చేసిన బొగ్గుల బట్టీలు



విక్రయానికి సిద్ధం చేసిన బొగ్గుల ప్యాకెట్లు

యల్లనూరు: మండలంలో బొగ్గుల బట్టీలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. యల్లనూరు ఫారెస్ట్‌కు కూతవేటు దూరంలో బొగ్గుల బట్టీలు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. బట్టీ నిర్వాహకులు పచ్చని చెట్లను నరికి బొగ్గులుగా మారుస్తూ సొమ్ము చేసుకుంటున్నా.. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం నెలకు ఒక్కసారి కూడా అటవీ అధికారులు అటవీ ప్రాంతాన్ని పర్యవేక్షించడం లేదని తెలుస్తోంది. వేప, నేరేడు, కానుగ తదితర చెట్లకు ఎవరూ కాపలా ఉండడం లేదు. బొగ్గుల బట్టీల నిర్వాహకులు చెట్లను నరికేస్తున్నా పట్టించుకోలేదు. బొగ్గులకు కావాల్సిన కలపను ఈ యల్లనూరు అటవీ ప్రాంతం నుంచే తరలిస్తున్నారు. అయినప్పటికీ ముచ్చుకోట ఫారెస్ట్ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో బొగ్గుల వ్యాపారులు ఆడింది ఆట....పాడింది పాట అన్నట్లు తయారయ్యారు. యల్లనూరు మండలంలో యల్లనూరు, ఎన్‌కే కాల్వ రోడ్డు, కోడిమూర్తి, నిట్టూరులో అనధికారికంగా 30 బొగ్గుల బట్టీలు ఉన్నాయి. బొగ్గుల వ్యాపారులు ఒకరి మీద పర్మిట్లు ఉండగా ....మరొకరు బట్టీల నుంచి బొగ్గులను లారీలకు లోడ్ చేసి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని అటవీశాఖ అధికారులు ప్రశ్నించిన పాపాన పోలేదు.

ఫిర్యాదు చేసినా..

చెట్ల నరికివేతపై ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వన్య ప్రాణులైన నెమళ్లు, జింకలు గ్రామాల్లోకి వస్తున్నాయి. పొలాల్లో సైతం జింకలు సంచరిస్తున్నాయి. కొంతమంది వేటగాళ్లు నెమళ్లు, జింకలను వేటాడుతూ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారి వినిత్ కుమార్ స్పందించి బొగ్గుల బట్టీలు, అటవీ సంపదపై ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి దొంగల పనేనా ?

ఇటీవల అడవిలో నాలుగు శ్రీగంధం మొక్కలను నరికివేశారు. వాటిని నరికింది గుర్తుతెలియని వ్యక్తులా..లేక ఇంటి దొంగలా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. యల్లనూరు అటవీ ప్రాంతంలో 16 శ్రీగంధం చెట్లు ఉన్నాయి. ఇటీవల నాలుగు శ్రీగంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఘటనపై ఫిర్యాదు అందడంతో ఎస్ఐ రాంప్రసాద్, ఏఎస్ఐ సంపత్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు కానీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు.

చర్యలు తీసుకుంటాం



ఇప్పటి వరకూ యల్లనూరులో ముగ్గురికి పర్మిట్లు ఉన్నాయి. అటవీ ప్రాంతానికి 200 మీటర్ల వరకూ బొగ్గుల బట్టీలు పెట్టకూడదు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– జగన్నాథం, ముచ్చుకోట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

3 నుంచి దసరా మహోత్సవాలు




అలంకరణలో ముసలమ్మ తల్లి , వేద గాయత్రీదేవి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన ముసలమ్మ తల్లి దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి దసరా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుశీలమ్మ ఆదివారం తెలిపారు అక్టోబర్ 3న ముసలమ్మ తల్లి బాల త్రిపుర సుందరీదేవి, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరీ దేవి, 7న మహా చండీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీ దేవి 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధనీ దేవి, 12వ తేదీ విజయ దశమిన రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనం ఇస్తారన్నారు.

గాయత్రీదేవి ఆలయంలో..

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సంజీవనగర్‌లోని వేద గాయత్రీదేవి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 3న బాలత్రిపుర సుందరీ అలంకారం, 4న రాజరాజేశ్వరీదేవి అలంకారం, 5న గాయత్రీదేవి అలంకారం, 6న అన్నపూర్ణాదేవి అలంకారం,7న లలితా త్రిపురసుందరి అలంకారం, 8న, మహాలక్ష్మీ అలంకారం, 9న సరస్వతీదేవి అలంకారం, 10న దుర్గాదేవి అలంకారం, 11న మహిషాసురమర్ధిని అలంకారం, 12వ తేదీ రజత కవచం అలంకారంలో గాయత్రీ దేవి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వీరాపురంలో కార్డెన్ సెర్చ్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



పీ కొండాపురంలో పోలీసుల నాకాబందీ

తాడిపత్రి రూరల్: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామం వీరాపురంలో ఆదివారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అత్యంత సమస్యాత్మక వ్యక్తులకు వార్నింగ్ ఇచ్చారు. వాహనాలు, ఇళ్లు, గడ్డివాములు తదితర చోట్ల సిబ్బంది తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పి.కొండాపురంలో నాకాబందీ

పామిడి: పామిడి పంచాయతీ పరిధిలోని పి.కొండాపురంలో సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో కలియ తిరిగారు. అనుమానస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు, గడ్డివామి ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ రూల్స్‌తో పాటు హెల్మెట్ వాడకం వల్ల చేకూరే ప్రయోజనాల గురించి సీఐ గ్రామస్తులకు వివరించారు.

మేడిమాకులపల్లిలో..

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకుపల్లిలో ఆదివారం ఎస్ఐ చిన్నరెడ్డప్ప ఆధ్వర్యంలో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గతంలో ఫ్యాక్షన్ గొడవల్లో ఉన్న వారు, గ్రామసస్తులతో వారు మాట్లాడారు. ఎవరైనా గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

జూదరుల అరెస్ట్



అరెస్ట్ చేసిన జూదరులతో సీఐ సాయిప్రసాద్

తాడిపత్రి అర్బన్: పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేశామని అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని నంద్యాల రోడ్డులో పేకాటాడుతున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో పట్టణానికి చెందిన సోమల కొండారెడ్డి, జూటూరు బాలిరెడ్డి, శివకుమార్, జూటూరు అమర్నాథ్, గాలి వేణుగోపాల్‌రెడ్డి, కొండు రామసుబ్బారెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.32,280 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగండి

పట్టణంలో శాంతిభద్రతలకు, ప్రశాంత జీవనానికి భంగం కల్గిస్తే కఠినచర్యలు తప్పవని అర్బన్ సీఐ సాయిప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటరర్లు, మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజా జీవనానికి విఘాతం కల్గించకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

ధర తగ్గడంతో కొర్ర రైతుకు నష్టం



శనగలగూడూరు వద్ద సాగు చేసిన కొర్ర పంట

పుట్లూరు: ధరలు తగ్గడంతో కొర్ర రైతులు నష్టపోతున్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో క్వింటాల్ కొర్రలు రూ.7 వేల వరకూ పలికాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో కొర్ర పంటను రైతులు భారీ ఎత్తున సాగు చేశారు. మండలంలోని శనగలగూడూరు, తక్కళ్లపల్లి, వెంగన్నపల్లి, గాండ్లపాడు, పుట్లూరు తదితర గ్రామాల్లో 630 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎకరా కొర్ర సాగుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకూ పెట్టుబడి పెట్టగా నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే మార్కెట్‌లో క్వింటాల్ రూ.2,500 మాత్రమే ధర లభిస్తుండటంతో రైతులకు నష్టం తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కొర్ర రైతులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆదివారం సాయంత్రం ఓ ట్రాక్టర్‌లో పెన్నానది నుంచి ఇసుక నింపుకుని ఎటువంటి బిల్లు లేకుండా నిట్టూరు గ్రామం మీదుగా తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని బుగ్గ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్బరాయుడు, అరవింద్ అనే వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా వెలిదెండ్ల గ్రామానికి చెందిన వారు ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వస్తూ అర్జాస్ స్టీల్ ప్లాంట్ వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. వీరిలో సుబ్బరాయుడి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురానికి తరలించామని సీఐ తెలిపారు.

కంప చెట్లను తొలగించండి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

శింగనమల: మండలంలోని శింగనమల– మరువకొమ్మ, శింగనమల–తరిమెల రోడ్డు, నిదనవాడ–ఆనందరావుపేటకు వెళ్లే రోడ్లకు ఇరువైపుల కంప చెట్లు పెరిగాయని, దీంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. శింగనమల– మరువకొమ్మకు ఉన్న 3 కిలో మీటర్లు ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డు మీదకు వచ్చాయి. ఎదురుగా వాహనాలు వస్తే ఒకరికొకరు ఢీకొనే ప్రమాదం నెలకొంది. శింగనమల– సలకంచెర్వు–రాచేపల్లి–తరిమెల వరకూ సింగిల్ రోడ్డు ఉంది. ఈరోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో, ఎదురుగా వాహనాలు వస్తే చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆదేవిధంగా నిదనవాడ– ఆనందరావుపేట రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు విపరీతంగా పెరిగాయి. గతంలో ఈ రోడ్డులో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ప్రతి ఆదివారం సుంకలమ్మ దేవాలయానికి భక్తులు ఈరోడ్డు గుండా వెళ్తుంటారు. కంప చెట్లు పెరగడంతో భక్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సినీ పరిశ్రమకు గుంతకల్లుతో అనుబంధం ఎక్కువ



సుమన్‌కు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

గుంతకల్లు/గుంతకల్లు రూరల్: సినీ పరిశ్రమకు గుంతకల్లుకు అనుబంధ సంబంధాలు ఉన్నాయని, తన సినిమాలకు ఇక్కడి డిస్ట్రిబ్యూటర్లు చాలా మంది సహకరించారని సినీ హీరో సుమన్ గుర్తుచేశారు. ఆదివారం పట్టణానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లుకు చెందిన డిస్ట్రిబ్యూటర్లు తమ సినిమాలకు అడ్వాన్స్‌లు ఇస్తే చాలు అ సినిమా సెంటిమెంట్‌గా బాగా కలిసివచ్చేదన్నారు. ఇక తిరుమల లడ్డూ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. టీటీడీ బోర్డు చైర్మన్ విషయంలో పార్టీలకు అతీతంగా భక్తిభావంతోపాటు తిరుమల దేవస్థానంపై అవగాహన కల్గి ఉండే వారినే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పసుపుల హరి హరినాథ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప, ఎద్దుల కాటన్ నిర్వాహకుడు మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టూటౌన్ సీఐ మస్తాన్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం సుమన్ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు అర్చకులు, ఈఓ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను సుమన్‌కు అందజేశారు.

హామీలు అమలు చేయకుండా లడ్డూపై రాజకీయమా?



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

పుట్లూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, తిరుమల లడ్డూపై రాజకీయం చేయడం దారుణమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి మండిపడ్డారు. ఆదివారం మండలంలోని చింతకుంటలో సీపీఐ కార్యవర్గ సమావేశం ఆ పార్టీ మండల కార్యదర్శి పెద్దయ్య అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయడానికి, విజయవాడ వరద బాధితుల కష్టాలు తీర్చకుండా, ఎన్నికల హామీల అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడానికి తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ నాణ్యతపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మూడో పెళ్లి క్రైస్తవ మత ఆచారంలో చేసుకున్నారని, ఆయనే ఇప్పుడు వేషం మార్చి తిరుమలలో ప్రసాదంపై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్దిరాజు, పెద్దన్న, ఓబుళపతి, బాలు, ఆంజనేయులు, కుళ్లాయప్ప, శివ, బలరాముడు, రామంజి, దావిద్, సూరి, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లతా మంగేష్కర్ జయంతి



లతా మంగేష్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు




లతా మంగేష్కర్ పాటలు పాడుతున్న గాయకులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న లతా మంగేష్కర్ 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లతా మంగేష్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గుత్తి రైల్వే డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ మాట్లాడుతూ లతా మంగేష్కర్ ప్రపంచంలోనే చాలా గొప్ప గాయని అన్నారు. అనంతరం పలువురు సినిమా, క్లాసికల్, ఫోక్ సాంగ్స్ పాడి అందరినీ అలరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలైన గాయకులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, బాల సుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, సెక్రటరీ డాక్టర్ శాంతి ప్రియ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భాస్కర్, ఉపాధ్యక్షుడు జ్ఞాన శేఖర్, సభ్యుడు జెమిని సురేష్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ రవికుమార్, గాయకులు నాగరాజు, సుధాకర్ బాబు, జాఫర్, శ్రీదేవి, రసూల్, బాల మురళి, చలపతి, రైల్వే అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపుతో రజకులకు కష్టాలు



పెన్నానదిలో దుస్తులు ఉతుకుతున్న రజకులు



ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం



రజకులు దుస్తులు ఆరేసుకునే ప్రాంతంలో గుంతలు ఇలా..

తాడిపత్రి రూరల్: పెన్నానదిలో అక్రమంగా ఇసుక తరలింపు వల్ల రజకులు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు.. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు ఏడు వేల కుటుంబాలు పెన్నానదిపై ఆధారపడి కులవృత్తి చేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా రజకులు తమ వృత్తి కోసం ఉపయోగించుకుంటున్న ప్రాంతంలో ఎద్దుల బండ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తరలింపు అధికం కావడంతో పెద్ద ఎత్తున గుంతలు పడుతున్నాయి. రజకులు ఉతికిన బట్టలు ఆరేసుకునేందుకు రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా అనుమతి ఇచ్చిన పెన్నానది పరివాహక ప్రాంతంలోని కొంతభాగంలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వకాలను అడ్డుకునేందుకు గతంలో రజక సంఘం నాయకులు పలు ప్రయత్నాలు చేశారు. దారికి అడ్డంగా పెద్ద ఎత్తున రాళ్లు వేశారు. తమకు తాత్కాలికంగా కేటాయించిన ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయించారు. అప్పట్లో తీసుకున్న చర్యల వల్ల తాత్కాలికంగా ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి. ప్రస్తుతం మళ్లీ అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతుండడం రజకులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో ఇసుక తరలింపు కోసం ట్రాక్టర్ల నిర్వాహకులు తాత్కాలికంగా రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ట్రాక్టర్లలో ఇసుక తరలించకుండా పోలీసులు అడ్డుకోవడంతో ఎద్దుల బండ్ల నిర్వాహకులకు వరంగా మారింది. ప్రస్తుతం ఈ రహదారిని ఎద్దులబండ్ల యజమానులు ఇసుక తరలింపునకు ఉపయోగించుకుంటున్నారు. ఇసుకకు డిమాండ్ ఏర్పడటంతో పెన్నానదిలో ఇసుకను ఎద్దుల బండ్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తరలింపు వల్ల ఆ ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడడంతో రజకులు దుస్తులు ఆరేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇసుక తరలింపును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ఎద్దుల బండ్ల యజమానులు గడ్డపారలతో దాడి చేస్తామంటూ బెదిరిస్తున్నారని రజకులు రాజు, రంగమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణాపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రజకాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు వాపోయారు.

గడ్డివామి దగ్ధం

పామిడి: మండలంలోని ఎదురూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి ప్రాంతంలో రైతు రామకృష్ణకు చెందిన వరి గడ్డివామి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వామికి నిప్పుపెట్టారు. సమాచారం అందుకున్న గుంతకల్లు ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చేలోపే గడ్డి మొత్తం కాలి బూడిదైంది. రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.